# మౌలిక సమస్యపై ఉద్యమించటమే చేనేత సంక్షోభ నివారణకు పరిష్కారమార్గం

**చేనేత** వస్త్రాల తయారీ ద్వారా దేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన నేత కళాకారులు నేడు ఆకలి, రోగాలతో అలమటిస్తూ, జీవచ్ఛవాల్లా బ్రతుకుతూ, బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. చేనేత వృత్తి కునారిల్లుతూ మరణశయ్యవైపు పయనిస్తున్నది. పాలకుల విధానాలే చేనేత వృత్తిదారుల ప్రస్తుత పరిస్థితికి కారణమన్నది కాదనలేని వాస్తవం.

దేశంలో ప్రస్తుతం 24 లక్షల చేనేత మగ్గాలు కోటిమందికిపైగా ఉపాధి కల్పిస్తున్నాయి. బెనారస్, కంచి, బెంగాలీ చీరెలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందాయి. ఆంధ్రప్రదేశ్‌లో 3,59,212 కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇందులో 1,282 చేనేత సంఘాల్లో 2,00,310 కుటుంబాలు వుండగా, సహకార సంఘాల పరిధిలో 1,58,302 కుటుంబాలు వున్నాయి. ఉప్పాడ, ధర్మవరం, పొందూరు, వెంకటగిరి, మంగళగిరి, వేటపాలెం చేనేతకు ప్రసిద్ధిపొందాయి.

చేనేత వృత్తి ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి కొనసాగింది. చేనేత వస్త్రాలను 80 శాతం పైగా గ్రామీణ ప్రజలే కొనుగోలే చేసేవారు. చేనేతవృత్తి, వ్యవసాయం ఒక దానితో మరొకటి సంబంధం కలిగి వుండేవి. ఇచ్చిపుచ్చుకునే విధంగా ఆర్థిక సంబంధాలు వుండేవి. దీనిఫలితంగా అప్పుడప్పుడూ ఒడుదుడుకులు ఏర్పడినా 1980 దాకా చేనేత వృత్తి మనుగడ ప్రమాదంలో పడలేదు.

**పాలకుల విధానాలు:**

దేశీయ దళారీ పాలకులు చేనేత రంగాన్ని బడాపరిశ్రమాధిపతులకోసం బలిపెట్టే విధానాలు అనుసరించటంతోపాటు వ్యవసాయరంగం సంక్షోభంలో పడటంవలన చేనేత సంక్షోభం ప్రారంభమైంది. రాజీవ్‌గాంధి ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా 1985 సంవత్సరంలో జాతీయ జౌళి విధానాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ విధానం జౌళి రంగంలో పెను మార్పులకు కారణమైంది. ఉత్పత్తి ప్రాతిపదికగా ఈ విధానం రూపొందించబడింది. ఇది ఆధునిక యంత్రాలువైపు మళ్లటమే, చేనేత వృత్తినిగాని, పేదల జీవనోపాధి గురించి ఈ విధానం పట్టించుకోలేదు. 1985లోనే జౌళి రంగంలో సంస్కరణలు మొదలయ్యాయి. పవర్‌లూమ్ అభివృద్ధికి ప్రాధాన్యత యిచ్చిన ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకొనే చర్యలు తీసుకొంటున్నట్లు నాటకమాడింది. మిల్లులు 50శాతం చిలపనూలును ఉత్పత్తి చేయాలని, 22 రకాలను చేనేత రంగంలోనే ఉత్పత్తి చేయాలనీ, దీన్ని పర్యవేక్షించటానికి నిఘా విభాగం ఏర్పాటైందని చెప్పటం నేతవృత్తిదారులను మభ్యపెట్టేందుకేనన్నది ఆచరణ, అనుభవం రుజువు చేసింది.

చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యస్.ఆర్.సత్యం కమిటీని ప్రభుత్వం నియమించింది. 1999లో నివేదికను ఈ కమిటీ ప్రభుత్వానికి అందజేసింది. సత్యం కమిటీ నివేదికలో చేనేత రంగానికి కేటాయించిన రిజర్వేషన్లను తొలగించాలనీ, మూడవశ్రేణి చేనేత కార్మికులను మరమగ్గాలవైపు లేదా ఇతర వస్త్ర సంబంధ కార్యకలాపాలవైపు మళ్లించటం, హ్యాంక్ యార్న్ అబ్లిగేషన్ పథకాన్ని రద్దుచేయటం నివేదికలోని ప్రధాన అంశాలు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తంకావటంతో కేంద్రప్రభుత్వం దాని ఆమోదానికి వెనక్కి తగ్గింది.

సత్యం కమిటీ నివేదికను ఆమోదించకపోయి నప్పటికీ, దాని ఆధారంగానే 2000 సం॥లో నూతన జౌళీవిధానాన్ని ప్రవేశపెట్టింది. చేనేత రంగానికి గొడ్డలి పెట్టుగా మారి అపెరల్, టెక్స్‌టైల్ పార్కులకు, పవర్‌లూమ్ రంగం అభివృద్ధికి పెద్దపీటవేసింది. ఎగుమతి తయారీ వస్త్ర ఉత్పత్తి పేరుతో చేనేత ఉనికికే ఎసరు పెట్టింది. ఈ నివేదిక ప్రకారం చేనేతకు అవసరమై చిలపనూలు ఆబ్లికేషన్ యాక్ట్‌ను 40 శాతానికి కుదించారు. చేనేత ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టం అమలు కాకుండాచేసి, బడ్జెట్‌లో చేనేతకు ప్రతి సంవత్సరం 5 శాతం కోత విధించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేత సమస్యల ఎడల ఆర్థికమంత్రి రోశయ్య అధ్యక్షతన 17 జులై 2004న నిపుణుల కమిటీని నియమించింది. తన రిపోర్టును ఈ కమిటీ జులై 2005లో ప్రభుత్వానికి అందజేసింది. చేనేత రంగం పవర్‌లూమ్ పోటీకి తట్టుకోలేదు కాబట్టి ఆ రంగంలోని యువకులను, మహిళలను, వృద్ధులను, కార్మికులను ఇతర రంగాల్లోకి మళ్లించాలనీ చెప్పిందే తప్ప మౌలిక అంశాల జోలికి వెళ్లలేదు. నివేదిక ప్రభుత్వంవద్ద వుండగానే ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ మరియు అపెరల్ ప్రోత్సాహక విధానం 2005-10 రూపొందటం వెనుక పవర్‌లూమ్‌లాబీ, ప్రపంచబ్యాంక్ విధానాలకు ప్రభుత్వం ఆమోదం వెల్లడైంది. 2006 సంవత్సరంలో కేంద్రం జాతీయ ముసాయిదా విధానం ప్రవేశపెట్టినా దానివలన చేనేత వృత్తికి ఎటువంటి ప్రయోజనం లభించలేదు.

నూతన జౌళి విధానం పవర్‌లూమ్‌కి అనేక రాయితీలు కల్పించి, చేనేత పరిశ్రమను దెబ్బతీసేదిగా వుండటంతో చేనేత వృత్తిదారుల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ వ్యతిరేకతను చల్లార్చేందుకు 22 రకాల ఉత్పత్తులను చేనేతకు రిజర్వుచేస్తూ చట్టం చేయటం జరిగింది. ఇవి చేనేత రంగంలోనే జరగాలని, ఇతర పరిశ్రమలు ఉత్పత్తి చేయకూడదని చట్టంలో పేర్కొన్నారు. 1995 నాటికి ఈ రిజర్వేషన్ కూడా నీరుగార్చబడింది. బడా మిల్లు యజమానుల లాబీకి తలొగ్గిన పాలకులు 22 వస్త్రాల నుండి 11 రకాలకు కుదించారు. ఇది చేనేత వృత్తిపై తీవ్రప్రభావం చూపింది. దీన్ని కూడా ఆచరణలో పాలకులు అమలు జరపలేదు.

రిజర్వేషన్ అమలుకై నియమించబడి నిఘా విభాగం అలంకారప్రాయంగానే మారింది. పాలకులనుండి నిధులు, ప్రోత్సాహం లభించకపోవటమే అందుకు కారణం. చేనేత రంగాన్ని మూలనబెట్టి వస్త్ర ఉత్పత్తినంతటిని బడామిల్లుల ఆధీనంలో వుంచటమే ప్రభుత్వ విధానంగా వుంది.

**నూలు సమస్య**

చేనేత వత్తికి నూలు అతిముఖ్యమైన ముడి సరుకు. పత్తిరైతులకు గిట్టుబాటు ధర అందించటం, నాణ్యమైన నూలు తయారుచేసి తక్కువ ధరలకు చేనేత వృత్తిదారులకు సరఫరా చేయటం అనే లక్ష్యంతో నూలు మిల్లులు ఏర్పాటు చేస్తున్నట్లు పాలకులు ప్రకటించారు. సహకార పద్ధతుల్లో పత్తి రైతులు ఏర్పాటుచేసుకొనే మిల్లులు, వస్త్రాల ఉత్పత్తిదారులైన చేనేత వృత్తిదారులు చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేకొనే నూలు మిల్లులుగా విభజించారు.

ఆసియా ఖండంలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ లోని గుంతకల్లులో 1954 సంవత్సరంలో సహకార రంగంలో నూలుమిల్లు ఏర్పాటు చేశారు. నూలుమిల్లుల ఏర్పాటు గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుల్లో ఎక్కువగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, బీహార్, బెంగాల్, అస్సాంలలో తక్కువగా జరిగాయి. 1974లో భారత దేశంలో 72 స్పిన్నింగ్ మిల్లులు స్థాపించేందుకు అనుమతి యిచ్చారు. సహకారరంగంలో 56 నూలు మిల్లులు ఏర్పడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 6 మిల్లులు సహకారసంఘంలో స్థాపించి ఉత్పత్తి చేశాయి. 1992 నాటికి రాష్ట్రంలో నూలు మిల్లులు 12 పెరిగాయి. మొదట మిల్లులు బాగా నడపటమే కాకుండా, చేనేత వృత్తిదారులకు, చేనేత సహకార సంఘాలకు నూలు కొరత లేకుండా అందించాయి.

పాలకులు, బడా పెట్టుబడిదారుల అనుకూల విధానాలు అనుసరించి, వారి ప్రయోజనంకోసం సహకార నూలు మిల్లులను సంక్షోభంలోకి నెట్టి అవి మూలపడేలా చేశారు. ఆ విధంగా ఉమ్మడి రాష్ట్రంలో చీరాల, నెల్లూరు, కలూరిపేట, పర్చూరు, సిరిసిల్ల, అదిలాబాద్, రాజమండ్రి, సత్తెనపల్లి, మహబూబ్‌నగర్, కరీంనగర్ స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయి. ఫలితంగా వేలాది కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

నూతన జౌళివిధానం ఫలితంగా నూలు మిల్లులు మూతపడటంతో చేనేత వృత్తికి నూలు సమస్యగా మారింది. నూలు అందించాలని చేనేత వృత్తిదారులు ఆందోళన చేపట్టారు. ఫలితంగా వృత్తిదారులను మభ్యపర్చేందుకు తాము ఉత్పత్తిచేసే నూలులో మిల్లులు 50శాతం చిలపలనూలు తయారు చేయాలని చిలపల నూలు ఆబ్లిగేషన్ చట్టంలో పేర్కొన్నారు. మిల్లు యజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా ఆబ్లిగేషన్ చట్టాన్ని 2003లో సవరించి చిలపలనూలు ఉత్పత్తిని 50 నుండి 40 శాతానికి పాలకులు తగ్గించారు. చట్టసవరణతో సంవత్సరంలో ఎప్పుడైనా దాన్ని ఉత్పత్తిచేసే వెసులుబాటు మిల్లులకు ఏర్పడింది. దీనివలన నూలు అవసరానికి అందక, అధిక ధరపెట్టి ప్రైవేట్ వ్యాపారులవద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి చేనేతలకు ఏర్పడింది. చిలపల నూలు ఉత్పత్తిలో 39 శాతం పవర్‌లూమ్‌లే ఉపయోగిస్తున్నాయని 1999లో సత్యంకమిటీ వెల్లడించింది. కాంపోజిట్ మిల్లులు విపరీతంగా పెరుగుతుండటంతో చిలపలనూలు దొరికే పరిస్థితి గగనమౌతుందని దక్షిణ భారత మిల్స్ అసోసియేషన్(ఎస్ఐఎంఎ) పేర్కొంది. మిల్లులు తప్పుడు లెక్కలు ప్రభుత్వానికి చూపుతూ, చిలపల నూలు కొనేవారులేరని, నిల్వలు ఉన్నాయని ప్రభుత్వానికి తెలియచేశారు. ఇలాంటి మోసాలతో చిలపలనూలు ఆబ్లిగేషన్ చట్టాన్ని రద్దుచేయించేందుకు బడా నూలు మిల్లుల లాబీ బలంగా ప్రయత్నం చేసింది. నిర్ణయించిన దానికి భిన్నంగా 26 శాతం మాత్రమే మిల్లుల్లో చిలపనూలు ఉత్పత్తి జరుగుతున్నది. పవర్‌లూమ్‌లు, టెక్స్‌టైల్స్ మిల్లులకు అవసరమైన 'కోన్' దారం ఎక్కువగా తయారు చేస్తున్నారు.

ఆబ్లిగేషన్ చట్టానికి అనుగుణంగా మిల్లులు చిలపలనూలు ఉత్పత్తి చేయకపోవటంతో నూలు కొరత ఏర్పడి మార్కెట్‌లో ధర బాగా పెరిగింది. 2011లో 100 కౌంటు బేలు నూలుధర 1750 రూ. వుండగా ఇప్పుడు రెండువేలకు పైగా వుంది. 80 కౌంటు 1580 నుండి 1900 రూ.పెరిగింది. రంగులు, రసాయన ధరలు కూడా పెరిగాయి. ఫలితంగా మిల్లు బట్ట ధరకన్నా, చేనేత బట్ట ధర ఎక్కువగా వుండటంతో వాటి నిల్వలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా చేనేత వృత్తిదారులు ఉపాధిని కోల్పోతున్నారు.

**పవర్‌లూమ్ ఆధిపత్యం**

భారత జౌళిరంగంలో మూడు రకాల ఉత్పత్తులు జరుగుతున్నాయి. చేనేతరంగం, మిల్లురంగం, పవర్‌లూం. భారత జౌళిపరిశ్రమ స్థూలంగా సంవత్సరానికి 47 బిలియన్ డాలర్ల మార్కెట్ చేస్తున్నది. ఇందులో 15 బిలియన్ డాలర్ల వస్త్రాల ఎగుమతి అవుతున్నాయి. భారత జౌళి ఉత్పత్తిలో పవర్‌లూం గుత్తాధిపత్యం వహిస్తున్నది. ఈ రంగంలోనే 70 శాతం వరకు ఉత్పత్తి జరుగుతున్నది. సాదా వస్త్రాలు, ఫర్నిషింగ్, డ్రెస్ మెటీరియల్స్, చీరెలు, టవల్స్, ధోవతులు మొదలైనవి ఈ పరిశ్రమ ఉత్పత్తి చేస్తున్నది. వీటి ఉత్పత్తులే అత్యధికంగా ఎగుమతి చేయబడుతున్నాయి. మహారాష్ట్రలోని "భీమండి" అతి పెద్ద పవర్‌లూం పరిశ్రమ. 4.5 లక్షల పవర్‌లూంలు ఇక్కడ వున్నాయి. రెండవ పెద్దపవర్‌లూం తమిళనాడులో వుంది. 3.34 లక్షల పవర్‌లూంలు ఇక్కడ వున్నాయి. వీటిల్లో లక్షలాదిమంది కార్మికులు పని చేస్తున్నారు. ఈరోడ్, సేలం, సోమనూర్, అతియార్ ముఖ్యమైన పవర్‌లూం కేంద్రాలు. చేనేత వృత్తికి ప్రధాన కేంద్రాలుగా వున్న ప్రాంతాల్లోనే పవర్‌లూంలు స్థాపించారు.

పవర్‌లూం రంగానికి పాలకులు అనేక రాయితీలు, ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. టెక్స్‌టైల్స్ పార్కుల్లో జెట్‌లూంల కొనుగోలుకు ఎటువంటి హామీ లేకుండానే అప్పులు ఇస్తున్నాయి. టెక్స్‌టైల్స్ పార్కుల పేరుతో వేలాది ఎకరాలను బడా కంపెనీలకు కట్టబెడుతున్నారు. వేలాది కోట్ల రాయితీలు కల్పిస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తూరులో 300 కోట్లతో అత్యంత ఆధునిక జెట్ మగ్గాలు, 200 ఆటోమేటిక్ మగ్గాలను ఏర్పాటు చేశారు. వెయ్యిమంది కార్మికులు చేసే పనిని 12 గంటల్లో జెట్

మగ్గం చేస్తుంది. పవర్‌లూం పరిశ్రమలో ఉత్పత్తి భారీగా జరుగుతుండటంతో ఆ వస్త్రాలు పూర్తిగా విక్రయాలు జరక్కపోవటంతో చేనేతకు కేటాయించిన వస్త్రాలకు ఆ బొండ్లలువేసి మార్కెట్‌లో అమ్ముతున్నారు. ఇది చేనేత ఉత్పత్తుల నిల్వలు పేరుకుపోవటానికి కారణంగా వుంది.

మరమగ్గాలు వచ్చి సాంప్రదాయ మగ్గాలను దెబ్బతీస్తే, పవర్‌లూం వచ్చి రెంటినీ దెబ్బతీసింది. 1995 సం॥ లెక్కల ప్రకారం దేశంలో 65 లక్షల చేనేత కార్మికులు వుండగా 2010 నాటికి 42.32 లక్షలకు తగ్గిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షా 70వేల మగ్గాలు వుంటే, లక్ష మగ్గాలు మూలబడ్డాయి. ప్రస్తుతం ఈ సంఖ్య ఎక్కువగా వుంటుంది.

**ఆప్కో వైఫల్యం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (ఆప్కో) 1976 జూలైలో రిజిస్టర్ అయ్యింది. ఆంధ్రప్రదేశ్ సహకారసంఘాల చట్టం క్రింద ఇది రిజిస్టర్ చేయబడింది. దీని ప్రధాన ఉద్దేశం ప్రాథమిక చేనేత సహకారసంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెట్ కల్పించటం, ఈ సంఘాలకు ముడి సరుకులు అందించటం, ఉత్పత్తిదారులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించటం, వృత్తి నైపుణ్యం పెంచే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం, ఈ సంస్థకు గల విక్రయ కేంద్రాల ద్వారా ఉత్పత్తులను అమ్మటం. 1999-2000 సంవత్సరంనాటికి దేశవ్యాపితంగా 289 షోరూంలు, 1800 మంది సిబ్బంది ఉన్నారు. డైరెక్టర్లతో కూడిన నిర్వహణా కమిటీ ఉంది. ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఓ), వైస్‌ఛైర్మన్‌గాను, నిర్వహణాధికారిగా వ్యవహరిస్తాడు. ఆప్కో మూడు రకాల బట్టలను విక్రయిస్తుంది. జనరల్ వెరైటీ, వివరీ వెరైటీ, జనతా వెరైటీ-రిటైల్ షోరూంల ద్వారా జనరల్ వెరైటీలను విక్రయిస్తుంది. ప్రభుత్వానికి గల వివిధ శాఖలకు అవసరమైన బట్టలు ఉత్పత్తి చేయించి విక్రయించటాన్ని వివరీ వెరైటీగానూ, పేదవారికి విక్రయించే ముతక వస్త్రాలను జనతా వెరైటీగా పిలుస్తారు.

రాష్ట్రంలో ఆం.ప్ర. సహకారబ్యాంక్ ద్వారా నాబార్డ్ రీ ఫైనాన్స్ స్కీం క్రింద సహకార సంఘాలకు నిధులు అందుతాయి. ఆ నిధులను ఆప్కాబ్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డి.సి.సి.బి.) ద్వారా రుణాలు అందచేస్తుంది. నాబార్డ్ నిధులకు ఈ రెండు సంస్థలు మధ్యవర్తిత్వం వహించటం వలన వడ్డీరేట్లు పెరిగి సహకార సంఘాలపైన భారం పడుతున్నది. దీనిపై ఆందోళన వ్యక్తం కావటంతో సహకార సంఘాలకు అనుకూలంగా ఆప్కాబ్, డి.సి.సి.బి.లకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తానన్నది. ప్రభుత్వం దాన్ని సక్రమంగా నిర్వర్తించలేదు. సకాలంలో వడ్డీ రాయితీని పూర్తిగా చెల్లించలేకపోయింది. దీనివలన సహకార రుణాలే అందని పరిస్థితి ఏర్పడింది.

ప్రారంభంలో ఆప్కో 4 లక్షల కుటుంబాలకు పని కల్పించింది. ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేసింది. పాలకుల నుండి క్రమంగా సహకారం తగ్గిపోవటం, ఉత్పత్తి ఖర్చులు ఎక్కువై వస్త్రాల ధరలు పెరగటంతో అమ్మకాలు తగ్గటం ప్రారంభమైనాయి. 1992-93 సం॥లో 98 కోట్ల అమ్మకాలు జరగ్గా 2001-02 నాటికి 43.69 కోట్లకు తగ్గాయి. ఈ కాలంలో 1992 కన్నా వస్త్రాలరేటు పెరుగుదలను గమనిస్తే అమ్మకం ఇంకా చాలా తక్కువగా జరిగిందనేది వాస్తవం. ఆప్కో పరిస్థితి ఇలా ఉంటే, ప్రైవేట్‌రంగంలోని మాస్టర్స్ వీవర్స్ వద్ద ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి "ఆప్టెక్స్"ను ఏర్పాటుచేసి నిధులు ఇవ్వకుండా దాన్ని నిర్వీర్యం చేశారు. తమ ఉత్పత్తులు పూర్తిగా అమ్ముకోలేక మాస్టర్ వీవర్స్ ఉత్పత్తిని తగ్గించటంతోపాటు వారి దగ్గర పనిచేసే వారిని కుదించారు.

ఆప్కో పాలక మండలిలో అవినీతి పెద్దఎత్తున కొనసాగుతున్నది. పవర్‌లూం యాజమాన్యంతో కుమ్మక్కు అయిన పాలకమండలి అవసరమైనమేరకు కూడా సహకారసంఘాల నుండి వస్త్రాలు కొనుగోలు చేయకుండా పవర్‌లూం నుండి కొనుగోలుచేసి వాటి నుండి లబ్ధి పొందారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటికి చేనేత ముద్రవేసి ఎక్కువ ధరకు కొన్నట్లు లెక్కలు తయారుచేశారు. చేనేత వస్త్రాల పేరుతో ఎక్కువ ధరలకు అమ్మి కొనుగోలుదారులను మోసం చేశారు.

సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న చేనేత ఉత్పత్తిదారులను ఆదుకోవాలని, ఆప్కోని పటిష్టపర్చాలనీ, ఉపాధిని కల్పించాలనే ఆందోళన ఉధృతంకావటంతో, దాన్ని చల్లార్చే చర్యలు పాలకులు తీసుకోవాల్సి వచ్చింది. రాజీవ్ విద్యా మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు చేనేత వస్త్రాలను ఉచితంగా యిచ్చే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం 400 కోట్ల రూపాయలు దుస్తుల తయారీకి ఆప్కో ఆర్డర్ తీసుకొంది. చాలా సహకారసంఘాలు మూలన పడటం వలన ఆప్కోకి ఇంత భారీ మొత్తంలో వస్త్రాలు అందించే శక్తి లేకుండా పోయింది. ఉన్న సహకారసంఘాల శక్తిమేరకు కూడా ఆర్డర్లు ఇవ్వకుండా పూర్తిగా పవర్‌లూం నుండి ఆప్కో కొనుగోలు చేసింది. వాటికి చేనేతముద్రలు వేసి పిల్లలకు అందిస్తున్నది. పవర్‌లూంల నుండి కొనుగోలుచేసిన వస్త్ర ధర 35 రూ. కాగా చేనేత వస్త్ర ధర 80 రూపాయలుగా పిల్లలకు అందిస్తూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు.

పాలకులు, ఆప్కో అనుసరించిన విధానాల ఫలితంగా చేనేత ప్రాథమిక సహకారసంఘాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయి. ఆప్కో ఈ సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవటం, వస్త్రాలు కొనుగోలు చేయకపోవటం వలన ఆర్థిక సంక్షోభం ఏర్పడి సంఘంలోని సభ్యులకు పని కల్పించటమే సమస్యగా మారటంతోపాటు మజూరీలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో సగానికిపైగా సంఘాలు మూలనపడ్డాయి. గత 10 నెలల కాలంలో ప్రాథమిక సహకార సంఘాలకు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలే 11 కోట్లు వున్నాయి. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలవద్ద ప్రస్తుతం 60 కోట్లు విలువచేసే వస్త్రాలు నిల్వ ఉన్నాయి. ఆ శాఖామంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ప్రస్తుతం 10 శాతం మంది చేనేత వృత్తిదారులు మాత్రమే సహకారసంఘాల్లో పని చేస్తున్నారు. 90 శాతం మంది ప్రైవేట్ రంగంలో ఉన్నారు. ప్రస్తుతం సహకారసంఘాలుగా ఉన్నవాటిల్లో రాజకీయాలను అడ్డం

పెట్టుకొని పైరవీలు సాగిస్తున్నాయి. బోర్డులు పెట్టి ఉత్పత్తులు సాగిస్తున్నట్లు రికార్డులు సృష్టించి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. మరికొన్ని సంఘాల్లో సభ్యులు, మగ్గాలు లేకపోయినా ఆ సంఘాల యాజమాన్యం మాస్టర్ వీవర్స్‌తో లాలూచీ పడి వారి వద్ద పనిచేస్తున్నవారిని లెక్కల్లో సభ్యులుగా చూపుతూ పథకాల ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. కొన్ని సంఘాల్లో కొంతమేర పని జరుగుతున్నా యాజమాన్యం బంధుమిత్రులకే అది దక్కుతున్నది. చేనేత వృత్తిద్వారా పొట్ట నింపుకొనే వారికి మాత్రం కొద్దిమందికే సొసైటీల్లో ఉపాధి లభిస్తున్నది.

**బడ్జెట్ కేటాయింపులు**

చేనేత రంగాన్ని ఆదుకొంటామని, వృత్తిని పరిరక్షిస్తామని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా, వాటి విధానాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయనటానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం 2012-13 బడ్జెట్‌లో చేనేతకు 2960.50 కోట్లు కేటాయించి 291 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. 2013-14లో 519.50, 2014-15లో 621.51, 2015-16లో 486.60 కోట్లకు బడ్జెట్ కేటాయింపు తగ్గాయి. 2016-17 బడ్జెట్‌లో చేనేతరంగానికి కేటాయించింది 710 కోట్లు. చేనేత - జౌళిరంగాల బడ్జెట్ కేటాయింపులు విడివిడిగా ఉండాలని డిమాండ్ చేస్తూ దాన్ని పాలకులు పట్టించుకోకుండా రెంటికి కలిపి బడ్జెట్ కేటాయింపు చేస్తున్నారు. కేటాయింపులో చేనేతకు అన్యాయం జరిగి జౌళిరంగానికి ఎక్కువ ప్రయోజనం జరుగుతున్నది.

తాను అధికారంలోకి వస్తే చేనేత జౌళిరంగానికి వెయ్యి కోట్లు కేటాయిస్తానని చంద్రబాబు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని అమలుపర్చలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చేనేత - జౌళిశాఖలకు 2013-14 సంవత్సరంలో 214 కోట్లు కేటాయించి అందులో చేనేతకు 147.77 కోట్లుగా పేర్కొంది. 2014-15లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేనేతకు 96.86 కోట్లు చెప్పి 57.29 కోట్లు కేటాయించింది. 2015-16 సంIIలో 45.92 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులుకాగా, చేనేతకు కేవలం 16.37 కోట్లు కేటాయించింది. 2016-17 బడ్జెట్‌లో 124.56 కోట్లు కేటాయించి 27.65 కోట్లు యిచ్చింది.

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి చేసిన కేటాయింపులు పరిశీలిస్తే ఆ రంగం ఎదుర్కొంటున్న ఏ సమస్య పరిష్కారం కాకపోగా మరింత ఎక్కువ సంక్షోభంలో పడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన నిధులు చేనేత వృత్తిదారుల కన్నీటి చుక్కలను కూడా తుడిచే ప్రయత్నం చేయలేదు. చేనేతి వృత్తిదారులు ఉపాధి దొరకక, ఆకలి హాహాకారాలతో హృదయ విదారకంగా వందలాదిమంది బలవన్మరణాలకు పాల్పడ్డారు, పాల్పడుతున్నారు. కుటుంబాలు గడవక చేసిన అప్పులు తీరక మనోవ్యధకు గురౌతూ చస్తూ బ్రతుకుతున్నారు. చేనేత వృత్తిని పరిరక్షించాలనీ, ఆకలిచావులను అరికట్టాలని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేనేత వృత్తిదారులు చేసిన ఆందోళనకు, ఉద్యమాలకు ప్రజల మద్దతు యిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో చేనేత వృత్తిదారులకోసం కొన్ని పథకాలు ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించక తప్పలేదు.

**బకాయిల రద్దు - కొత్త రుణాలు**

పథకాలను ప్రకటించటం, ఆశలు కల్పించటం తరువాత వాటిని నీరుకార్చటం కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు. నేత సంఘాల వారికి, శ్రామికులకు రుణాలు మాఫీ చేయటంతోపాటు అన్నివిధాల ఆసరా కల్పిస్తామని ప్రచారం చేసుకొంటున్నాయి. 2010లో యువజన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఉత్తరప్రదేశ్‌కి వెళ్ళినప్పుడు కేంద్ర చేనేత - జౌళిశాఖ హడావుడిగా పునరుద్ధరణ, సంస్కరణ, పునర్ వ్యవస్థీకరణ పథకాలను ముందుకు తెచ్చింది. చేనేత సంఘాల, కార్మికుల బకాయిలు రద్దుచేయటం, కొత్త రుణాలు ఇవ్వటం, సబ్సిడీలు పెంచటం ఆ పథకంలో వున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ ఈ పథకానికి ఆమోదముద్ర వేసింది. ఈ పథకం ద్వారా దేశ వ్యాపితంగా 6 లక్షల కార్మికులతోపాటు 45 రాష్ట్ర చేనేత సహకార సంస్థలకు, 1600 ప్రాథమిక సహకార సంఘాలకు మేలు జరుగుతుందని యుపిఏ ప్రభుత్వం ప్రకటించింది. 12వ పంచవర్ష ప్రణాళికలో 3,884 కోట్లను రుణమాఫీకి కేటాయిస్తామని హామీ ఇవ్వటమే కాకుండా, కార్మికులకు చేయూతనందించే ఆరు అంచెల కార్యక్రమానికి 2,350 కోట్లు ఇస్తామనీ హామీ యిచ్చింది. అర్హులైన శ్రామికులకు పరపతి కార్డుల జారీ, పూచీకత్తు లేకుండా రెండు లక్షల రుణం, మూడుశాతం వడ్డీ అమలుచేస్తానని చెప్పింది. ఈ పథకం చేనేత వృత్తిదారుల్లో ఆశలు నెలకొల్పింది. ఆచరణలో ఇవి అమలు జరగలేదు. దీన్ని రుణమాఫీ పథకం క్రింద మార్చివేసింది. ఏడాది వ్యవధిలోనే 4500 కోట్లకు పథకాన్ని కుదించింది. రుణమాఫీ కూడా నామమాత్రంగానే జరిగింది. 2014 సంII వరకు 23 రాష్ట్రస్థాయి సంఘాలకు, 750 ప్రాథమిక సంఘాలకు, 52 వేలమంది కార్మికులకు మాత్రమే దీన్ని వర్తింప చేశారు. రుణమాఫీకి అనుసరించిన విధానం లోపాల మయంగా ఉంది. రుణాలు చెల్లించిన సంఘాలకు రుణమాఫీ వర్తింపచేయలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు 2007 నాటి ఆడిట్ రిపోర్టులు పంపగా ఆనాటి నుండి 2010 మార్చినాటికి ఉన్న బకాయిలకు వర్తింపచేసింది. 2007కు ముందు ఉన్న బకాయిలకు వర్తింపు చేయక పోవటంవలన చాలామంది రుణమాఫీ నుండి మినహాయించబడ్డారు. దీనికి అనేక ప్రక్రియలు అనుసరించారు.

2014 సార్వత్రిక ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రక్కన పెట్టింది. రుణమాఫీకి నిధులు కేటాయింపులో మొండి చేయి చూపింది. దేశవ్యాపితంగా చేనేత వృత్తి రుణ ఊబిలో కొట్టుమిట్టాడుతూనే ఉంది.

ఎన్నికల ప్రచారంలో వ్యవసాయ, డ్వాక్రా రుణాలతోపాటు నేత వృత్తిదారుల వ్యక్తిగత రుణాలు, చేనేత సహకారసంఘాల రుణాలు రద్దుచేస్తానని చంద్రబాబునాయుడు హామీ యిచ్చాడు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినా చేనేత రుణమాఫీ జరగలేదు. వ్యవసాయ రుణాల రద్దుపై నియమించిన రోశయ్యకమిటీ 2014 మార్చినాటికి చేనేత వృత్తిదారులు 110 కోట్లు, మరమగ్గాల్లో పనిచేసే కార్మికులు 15 కోట్లు, చేనేతసంఘాల్లో పనిచేసేశారు 240 కోట్లు మొత్తం 365 కోట్లు చేనేత రంగంలో

అప్పులు ఉన్నాయని పేర్కొంది. ఎప్పటికప్పుడు బకాయిలు చెల్లిస్తామని చెప్పటం తప్ప అందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోకపోవటంతో రుణాల రద్దుపై చేనేత వృత్తిదారుల్లో ఆందోళన ప్రారంభమైంది. గత రెండు బడ్జెట్లలో రుణమాఫీ ప్రస్తావనే లేదు. 2016-17 సం॥లో 110 కోట్లతో రుణాలు రద్దుచేస్తామని, రుణమాఫీ అర్హులను ప్రకటిస్తామని ప్రకటించి ఇప్పటికీ అర్హులను కూడా గుర్తించలేదు. ఆచరణలో మాఫీ ఏవిధంగా జరుగుతుందన్న ఆందోళన చేనేత ప్రజల్లో వ్యక్తమౌతున్నది.

**క్లస్టర్ల ఏర్పాటు**

భారతదేశంలో చేనేత పరిశ్రమ పరిరక్షణకు సమగ్ర క్లస్టర్ అభివృద్ధి పథకాన్ని ప్రారంభించినట్లు యుపిఏ ప్రభుత్వం చెప్పింది. ఈ విషయాన్ని ఆనాటి ఆర్థికమంత్రి చిదంబరం 2005-06 బడ్జెట్ సందర్భముగా పార్లమెంటులో ప్రకటించాడు. అందుకోసం దేశంలో 47 క్లస్టర్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. మొదటివిడతగా 40 కోట్లతో 20 క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ఒకే ప్రాంతంలో ఉన్న చేనేత మగ్గాలపై ప్రత్యేకమైన ఉత్పత్తులు చేయగల మగ్గాల సముదాయాన్ని క్లస్టర్ అంటారు. అవి ఒకే జిల్లాలో ఉండవచ్చు లేదా రెండు జిల్లాల్లో ఒకే ప్రాంతానికి చెందినవైనా కావచ్చు. క్లస్టర్‌లో కనీసం 1000 మగ్గాలకు తగ్గకుండా ఉండాలి. ఉత్పత్తి వైవిధ్యం కలిగిన ప్రత్యేక మార్కెట్ పోటీపడగల పరిస్థితి ఉండాలి. 470 క్లస్టర్ల ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఆ మేరకు ఇప్పటికీ ఏర్పాటు జరగలేదు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో గల క్లస్టర్ల వివరాలు-అస్సాం 23, ఆంధ్రప్రదేశ్ 23, బీహార్ 53, ఢిల్లీ 6, గుజరాత్ 19, గోవా 1, ఉత్తరప్రదేశ్ 67, బెంగాల్‌లో 19 ఉన్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1000 మగ్గాలు గల క్లస్టర్లు అదిలాబాద్, హైద్రాబాద్, నిజామాబాద్, రంగారెడ్డిలో; 1000 నుండి 5000లోపు మగ్గాల క్లస్టర్లు ఖమ్మం, విశాఖపట్నం, విజయనగరంలోనూ; 5000 నుండి 10,000లోపు మగ్గాల క్లస్టర్లు చిత్తూరు, కర్నూలు, కరీంనగర్, కృష్ణ, మెదక్, శ్రీకాకుళం, పశ్చిమగోదావరిలోనూ; 10,000 నుండి 25,000 మగ్గాల క్లస్టర్లు గుంటూరు, మహబూబ్‌నగర్, నెల్లూరు, కడప, తూర్పుగోదావరి, ప్రకాశం, వరంగల్ జిల్లాలలోనూ; 50,000 పైన క్లస్టర్లు అనంతపురంలో ఏర్పాటుకు నిర్ణయం జరిగింది.

క్లస్టర్లు ఎందుకు నిర్మిస్తున్నామని చెప్పారో అదిమాత్రం నెరవేరటంలేదు. కొద్దిమంది చేనేత వృత్తి దారులకే ప్రయోజనంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా చీరాలలో క్లస్టర్ అభివృద్ధి పథకం అమలు జరుగుతున్నది. 2010 నాటికి 150 కోట్ల రూపాయల విదేశీ మార్కెట్‌కి ఎగుమతులు చేయటం ద్వారా చేనేతల ఉపాధిని, కార్మికుల ఆదాయం పెంచవచ్చనే ఉద్దేశంతో ఈ క్లస్టర్ ఏర్పాటు జరిగింది. ఆవిధంగా ఈ క్లస్టర్ పనిచేయలేకపోయింది. ఈ క్లస్టర్ పరిధిలో పేదలు అధికంగా ఉన్నారు. వీరిలో చాలామంది మాస్టర్ వీవర్స్, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్థులు, వ్యాపారులవద్ద అప్పులు చేశారు. అప్పుల బాధతో చాలామంది కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారు.

చీరాల క్లస్టర్‌లో స్థానికులకంటే స్థానికేతరులే ఎక్కువగా ఉన్నారు. స్థానికులకు సొంత మగ్గంకాని, ఇల్లుగాని లేవు. మాస్టర్ వీవర్స్ షెడ్లలో వీరు పని చేస్తారు. దాదాపు 12 నుండి 15 గం॥ వరకు పనిచేస్తూ అర్ధబానిస జీవితం గడుపుతున్నారు. కూలీ చాలా తక్కువగా లభిస్తుంది. క్లస్టర్‌లో సొంతంగా పనిచేసు కోవటానికి మాస్టర్ వీవర్స్ నుండి బయటపడాలంటే వారివద్ద తీసుకున్న అప్పులు తీర్చాలి. ఆ పరిస్థితి వారికి లేదు. క్లస్టర్ పథకం డయాగ్నసిస్ అధ్యయన నివేదికలో కార్మికుల అప్పులు వాటి పరిష్కారం గురించి ప్రస్తావించలేదు. అప్పుల్లో ఉన్న కార్మికులకు క్లస్టర్ ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్లస్టర్‌లో 57,504 మంది సభ్యులు ఉంటే 25 వేల మందికి మొదట ప్రయోజనంగా ఉన్నప్పటికీ క్రమంగా సంఖ్య తగ్గుతూ వస్తున్నది. రాష్ట్రస్థాయిలో క్లస్టర్ల కమిటీ ఏర్పడి 2015లో సమావేశం నిర్వహించారు. నియోజక వర్గాల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. 70 కోట్లతో క్లస్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు ఒంగోలు అసిస్టెంట్ డైరెక్టర్ (చేనేత) 2016 మార్చి తొమ్మిదిన ప్రకటించారు. ప్రకాశంజిల్లాలో 16, గుంటూరు జిల్లాలో 15 బ్లాకులు రూపొంది ఒక్కో బ్లాకుకు 1.35 కోట్లు మంజూరుకాగా, 42 లక్షలు మాత్రమే విడుదల చేయటం జరిగింది. దీన్ని గమనిస్తే పథకాన్ని 70 నుండి 42 కోట్లకు కుదించారనేది అర్థమౌతుంది. ఇవి కూడా చేనేత వృత్తిదారులకు ఏ మేరకు ప్రయోజనం చేకూర్చేది వేచి చూడాల్సిన అంశంగానే వుంది. గత అనుభవాల దృష్ట్యా ఇది కూడా అమలు జరుగుతుందనే నమ్మకం లేదు. క్లస్టర్లవలన వృత్తినైపుణ్యం, ఆదాయం పెంపు కొద్దిమంది చేనేత వృత్తిదారులకు, కార్మికులకు మాత్రమే పరిమితమై అత్యధికమందికి ప్రయోజనం చేకూర్చలేకపోయాయి.

**సంక్షేమ పథకాలు**

చేనేత వృత్తిదారులకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని కేంద్ర-రాష్ట్ర పాలకులు చెప్పుకొంటున్నారు. ఈ పథకాలేవీ వారి దారిద్ర్యాన్ని, ఆకలి మంటలను, ఆత్మహత్యలను నివారించలేకపోయాయి. వర్క్ షెడ్‌కమ్ హౌస్‌మేక్ పథకం, రుణాల పునరుద్ధరణ పథకం, త్రిఫ్ట్‌ఫండ్, బీమాలాంటి అనేక పథకాలు ఆచరణలో విఫలమైనాయి. అలంకారమైన పథకాలు మిగిలాయి.

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన చేనేత వృత్తి తీవ్ర సంక్షోభంలో పడింది. వృత్తిదారులు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. అధునాతన మగ్గాలు అమర్చుకొనే ఆర్థిక పరిస్థితి లేక ఇప్పటికే ఎక్కువమంది పాతమగ్గాలపైన నేయటంవలన వారి ఆదాయం తక్కువగా వుంది. మరమగ్గాల వలన మహిళల ఉపాధి దెబ్బతిని కుటుంబానికి వారి ఆర్థిక చేయూత లేకుండాపోయింది. చాలీచాలని ఆదాయంతో తినీతినక అల్సర్, టి.బి., రక్తహీనతలాంటి దీర్ఘకాలిక జబ్బులపాలై చివరికి ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతంలో వీరి సంవత్సర ఆదాయం 29,314 కాగా, పట్టణ ప్రాంతంలో 36,260. ఇది వీరి దుర్భర పరిస్థితులకు అద్దంపడుతున్నది. చాలామందికి సొంత ఇళ్లు లేవు, 20శాతం మందికి రేషన్ కార్డులు లేవు. అసలు చదువుకోనివారు 29 మంది

వుంటే, 12.7 శాతం మంది ప్రాథమిక విద్యను మధ్యలోనే ఆపి వేశారు. ఉపాధిలేక, కుటుంబం గడవక గత్యంతరం లేని పరిస్థితుల్లో వందలాదిమంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. లక్షలాదిమంది ఉపాధిని వెతుక్కుంటూ వలసలు పోయారు.

**సంఘటిత ఉద్యమం**

చేనేతరంగం, చేనేత వృత్తిదారులు సంక్షోభం నుండి బయటపడాలంటే సంక్షోభానికి కారణమైన మౌలిక సమస్యలు పరిష్కారం కావాలి. చేనేత- జౌళి రంగాలను దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. పవర్‌లూం, జెట్‌లూం, కాంపోజిట్ మిల్లులను ప్రభుత్వమే నియంత్రించాలి. వాటికి ఇస్తున్న సబ్సిడీలను ఉపసంహరించాలి. చేనేత వృత్తిరక్షణకోసం ప్రభుత్వమే వర్క్‌షెడ్‌లు నిర్మించి చేనేత కార్మికులకు పని కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. చేనేతకు కేటాయించిన 22 రకాలను యధాతథంగా కొనసాగించాలి, నూలు, రంగుల ధరలు తగ్గించాలి. పవర్‌లూం వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చలామణి కావటాన్ని అరికట్టాలి. ఆకలి చావులకు, ఆత్మహత్యకు బలైన, బలయ్యే కార్మిక కుటుంబాలకు 10 లక్షల పరిహారం చెల్లించాలి. ప్రతి చేనేత కుటుంబానికి నివాస యోగ్యమైన ఇల్లు నిర్మించాలి. పాలకులకు వ్యతిరేకంగా యావన్మంది చేనేత వృత్తిదారులు ఈ డిమాండ్లపై సంఘటిత ఉద్యమం చేపట్టాలి. అప్పుడే చేనేతరంగం సంక్షోభం నుండి బయటపడుతుంది. ఆకలి-చావులు ఆగుతాయి.

oooooo